

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**ఆనా హైతో ఆ, రాహ్ మె కుఛ్ ఫేర్ నహీహై**

**భగ్‌వాన్ కి ఘర్ దేర్ హై, అంధేర్ నహీ హై.**

**హిందీ సినీ** చరిత్రలో 'నయాదౌర్' సినిమా ఒక నూతన దిశను చూపిన సరికొత్త మలుపు. అర్ధవంతమైన సినిమా, అతి అందంగా సృజించి, సమకాలీన సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని ఆదర్శవంతంగా అందించవచ్చని నిరూపించిన సినిమా అది. అభివృద్ధి అంటే ఆధునిక యాంత్రిక పరిజ్ఞానం. కానీ అధిక జనాభా కల భారతదేశంలో యంత్రాలు పెద్ద ఎత్తున అలవాటయితే ప్రజల జీవితం ప్రశ్నార్ధకమవుతుంది. ఆధునికత పేరిట వస్తున్న మార్పు పవనాలు వృత్తులను వాటిపై ఆధారపడిన వారి జీవికను సందేహాస్పదం చేస్తాయి. యంత్రాలు మనిషి స్థానాన్ని ఆక్రమిస్తే, మనిషి ఏం కావాలి? ఆనాడే కాదు, ఈనాటికీ మన దేశాన్నే కాదు ప్రపంచాన్నీ పట్టి పీడిస్తున్న సమస్య ఇది. ఆ సమస్యను ఎత్తి చూపిస్తూ యంత్రం కన్నా మనిషికి పెద్దపీట వేయాలని చూపిన సినిమా 'నయాదౌర్.' అత్యంత సీరియస్ కథను చెప్పేందుకు అతి సుందరమైన ప్రేమగాధను ఎంచుకున్నారు. దాన్ని మరింత ఆకర్షణీయం, ఉద్విగ్నతామయం చేసేందుకు ఇద్దరు స్నేహితుల గాధను, ప్రేమకథను ముడిపెట్టారు. ఇద్దరు ప్రాణ స్నేహితులు ఒకే అమ్మాయిని ప్రేమిస్తారు. ఇద్దరికీ ఆమెపై మనసుంటుంది. కానీ స్నేహం కోసం ఇద్దరూ అమ్మాయిని త్యాగం చేసేందుకు సిద్దపడతారు. అంటే సమస్య జటిలమైనది. ఎవ్వరూ ఒక్క అడుగు వెనక్కు వెయ్యరు. 'నువ్వే అమ్మాయిని చేసుకో' అని ఒక ఫ్రెండంటే, మరో ఫ్రెండు 'నువ్వే చేసుకో' అంటాడు తప్ప 'సరే' అనడు. అంత గాఢమైన స్నేహం వారిది. ఈ సమస్య తేలేదెలా? 'మనిషి తాను పరిష్కరించలేని సమస్యను భగవంతుడికి, విధికి వదిలేయాల'ని ఓ సూక్తి ఉంది. దాని ప్రకారం తను సమస్య పరిష్కారాన్ని భగవంతుడికి వదిలివేయాలని నిశ్చయించుకుంటారు. పండుగరోజు, ఆ అమ్మాయి భగవంతుడిని అర్పించే పూలరంగును బట్టి, ఎవరు ఆ అమ్మాయిని వరించాలో నిశ్చయించుకుంటారు. ఇక పండగ కోసం ఎదురు చూస్తారు. ఆ అమ్మాయి అర్చించే పూలరంగు తమ భవిష్యత్తును నిర్ణయిస్తుందని ఇద్దరూ ఆత్రంగా ఎదురు చూస్తుంటారు. ఆ సందర్భంలో వస్తుందీపాట. అమ్మాయి పళ్ళెంలో పూలు తీసుకుని పూలపై గుడ్డ కప్పి, భగవంతుడి సాన్నిధ్యానికి చేరి, గుడ్డ తీసి పూలను అర్పించేంతవరకూ సాగుతుంది పాట.

సాహిర్ లూథియాన్వీ వామపక్ష భావ ప్రేరేపితుడు. ఆయన విధిని, కాలాన్ని నమ్ముతాడు తప్ప దైవాన్ని నమ్మడు. సాహిర్ దేనితోను రాజీపడని మనస్తత్వం కలవాడు. ఈ పాట దైవంపై భారం ఉంచి పాడేపాట. దాన్ని సాహిర్ తన భావాలతో ఏమాత్రం రాజీపడకుండా ఎంతో సుందరంగా, భావస్ఫోరకంగా అత్యంత ప్రాక్టికల్‌గా, అందరికీ సులభంగా బోధపడే తాత్విక భావాలతో రచించాడు.

రావాలని ఉంటే రావచ్చు. దారిలో ఎలాంటి అడ్డంకులు లేవు. భగవంతుడి నిలయంలో ఆలస్యం అవచ్చుకానీ అన్యాయం (అంధకారం) జరగదు. ఇదీ పల్లవి భావం. సందర్భానికి తగ్గట్టుగా భావం. ఇది సామాన్యంగా అమలులో ఉన్న ఆలోచన. ఇక్కడ సాహిర్ ఆ ఆలోచనకు బాణీని తగ్గట్టు అమర్చాడు. ఇక ఇంకో చరణంలో నిత్యజీవిత సత్యాలను ఒకోమెట్టు ఎక్కుతూ ప్రదర్శిస్తాడు.

జబ్ తుఝ్ సె న సుల్ఝే తెరె ఉల్ఝేహువె ధంధే

భగవాన్ కె ఇన్సాఫ్ పె సబ్ ఛోడ్ దె బందే

ఖుద్ హీ తెరి ముష్కిల్ కొ వొ ఆసాన్ కరేగా

జో తూ నహి కర్‌పాయ తొ భగవాన్ కరేగా

చాలా సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే జీవిత సత్యాలను ప్రకటించాడు సాహిర్. మనుషులు తమ పనులను చిక్కుముళ్లతో నింపుతారు. సులభంగా సాధ్యమయ్యే దాన్ని జటిలం చేసుకుంటారు. అలాంటి జటిలమైన సమస్యను, అంటే తాము సృష్టించుకున్న జటిలమైన సమస్యను తాము పరిష్కరించుకోలేకపోతే దాని పరిష్కారాన్ని భగవంతుడిపై వదిలేయమంటున్నాడు. 'మన చేతుల్లో ఏముంది? మనం ఏం చేయలేనప్పుడు ఏం చేస్తాం? పైనున్న వాడిపై వదిలేస్తాం' అదీ భావం. ఎప్పుడయితే భారం భగవంతుడిపై వదిలేస్తామో అప్పుడు భగవంతుడే ఆ సమస్యను పరిష్కరిస్తాడు. మానవుడు చేయలేని దాన్ని భగవంతుడు చేసి చూపిస్తాడు. ఇక్కడ ఇద్దరు స్నేహితులు చిన్న సమస్యను జటిలం చేసుకున్నారు. ఆ అమ్మాయిని అడిగితే పోయేదానికి, తమలో తాము వాదించుకున్నారు. సమస్యను చిక్కుముళ్లు వేశారు. ఇప్పుడిక దాని పరిష్కారం భగవంతుడిపై వదిలేయటం తప్ప చేసేదేమీలేదు. అదే చేశారు. సినీ సందర్భంలో ఒదుగుతూ నిత్యజీవితంలో ప్రతి ఒక్కవ్యక్తి మనస్సుకు హత్తుకునే రీతిలో సార్వజనీన సత్యాన్ని ప్రకటించాడు కవి. అందుకే పాట వినగానే ఆ భావం మనసుకు పట్టేస్తుంది. ఎవరూ ఎలాంటి వివరణలు, వ్యాఖ్యానాలు ఇవ్వకుండానే 'చేతకాని దాని గురించి బాధపడాల్సిన అవసరం' లేదని చెప్తున్నాడు.

కహనే కి జరూరత్ నహి ఆనాహి బహుత్ హై

ఇస్ దర్ పె తెరా శీష్ ఝుకానాహి బహుత్ హై

జో కుచ్ హై తెరె దిల్‌మె వొ సబ్ ఉస్ కొ ఖబర్ హై

బందే తెరె హర్ హాల్ పె మాలిక్ కి నజర్ హై

ఈ చరణం కూడా సినీ సందర్భ పరిధిలో ఒదుగుతూ సార్వజనీన సత్యాలను సరళంగా ప్రకటిస్తోంది. భగవంతుడి దగ్గరకు వెళ్లి నోరు విప్పి కోరికలు చెప్పాల్సిన పనిలేదు. గోత్రం, పేరు చెప్పి అర్చనలు చేయించాల్సిన పనిలేదు. భగవంతుడికి తనని తాను సంపూర్ణంగా సమర్పించుకోవటం చాలు. మిగతావన్నీ అనవసరం. ఒకరకంగా తార్కితను ప్రదర్శిస్తూనే భక్తిభావతత్వాన్ని చెప్తున్నాడు సాహిర్. దేవుడికి బాధలు చెప్పుకోవాల్సిన పనిలేదు. మందిరానికి రావటం చాలు. ఆ ప్రాంగణంలో తలవంచటం చాలు. 'తల వంచటం' అంటే లొంగిపోవటమో, బానిసత్వమో కాదు. సంపూర్ణంగా అర్పించుకోవటం. అహంకారాన్ని వదిలివేయటం. ఇక్కడ ఒక సూక్ష్మమైన అంశం ఉంది. భారతీయ ధర్మంలో భగవంతుడిని ప్రేమించటం ఉంది. కొలవటం ఉంది. కానీ, తనని తాను దోషిలా, పనికి రాని వాడిలా భావించుకుని వేడుకోవటం, ప్రాధేయపడటం లేదు. ఇది ఇతర మతాల సంపర్కంతో వచ్చి చేరింది. కానీ మౌలికంగా భగవంతుడి ముందు తలవంచటం అంటే ఆత్మవిశ్వాసంతో, అహంకారాన్ని వదిలి విశ్వసించటం. లేకపోతే ఎదురుగా ఉన్న రాతిబొమ్మను సకల సృష్టికర్తగా భావించటం కుదరదు. హాస్యాస్పదం అనిపిస్తుంది. అక్కడ రాతిబొమ్మను కాక ఆ భావనలో ఇమిడి ఉన్న తత్వాన్ని గ్రహించి శిరసు వంచటం. 'ఇస్ దర్ పె తెరా శీష్ ఝుకానా హి బహు త్ హై అనటం వెనుక వున్నది విశ్వాసం తప్ప 'అజ్ఞానం' కాదు. ఎప్పుడయితే భగవంతుడిపై సంపూర్ణ విశ్వాసం ఉంచి, అతడిని సర్వాంతర్యామిగా భావిస్తాడో అప్పుడు అతడికి ఏమీ నివేదించాల్సిన అవసరంలేదు. ఏమీ కోరాల్సిన పనిలేదు. అన్నీ అతడికి తెలుసు. అన్నీ అతడే చూసుకుంటాడు. మనసులోని మాట తెలుసుకుని తీరుస్తాడు. అందుకే చివరి పాదంలో 'బందే తెరి హర్ హాల్ పె మాలిక్ కి నజర్ హై' అన్నాడు. అంటే అన్ని విషయాలు అతడికి తెలుసు. ఏమీ చెప్పనవసరంలేదు. కేవలం భగవంతుడి సన్నిధికి రావటం చాలు. ఇంకా ఏమీ అవసరం లేదు. గమనిస్తే ఎక్కడా సాహిర్ దైవాన్ని పొగడటం లేదు. 'నువ్వే అంతా నీ ముందు నేనెంత? ' అనటం లేదు.

విశ్వమంతా వ్యాపించి ఉన్న ఆశక్తితో వ్యవహరించాల్సిన తీరును తార్కికంగా వివరిస్తున్నాడు. ప్రాధేయపడటం, సాష్టాంగప్రణామాలు చేయటం కన్నీళ్లు కార్చి వేడుకోవటం అవసరంలేదు. వ్యక్తి తనని తాను కించపరచుకోవాల్సిన అవసరం లేదు విశ్వాసం ఉంటే చాలు అన్నీ అతడికి తెలుసు. సందర్భ పరిధిలో ఒదిగిన సాహిర్ అదే అంటున్నాడు.

బిన్ మాంగెభి మిల్తీ హై యహా మన్‌కి మురాదే
దిల్ సాఫ్ హో జిన్‌కా వొ యహా ఆకె సదా దే
మిల్‌తా హై జహా న్యాయ వొ దర్బార్ యహీహై
సంసార్ కి సబ్ సే బడి సర్కార్ యహీ హై

అద్భుతం! దైవాన్ని నమ్మి మందిరానికి వస్తే చాలు ఏమీ కోరనక్కరలేదు. అన్నీ అతడే చూసుకుంటాడని రెండో చరణంలో చెప్పి మూడో చరణానికి వచ్చేసరికి 'కోరికలు కోరకుండానే తీరతాయని' చెప్తూ అందుకు నియమం ఏమిటో కూడా చెప్పాడు. మొదటి చరణంలో 'అర్పణ', రెండో చరణంలో 'విశ్వాసం' చెప్తాడు. మూడో చరణంలో హృదయం స్వచ్ఛంగా ఉన్నవారు. ఇక్కడకి వచ్చి భగవంతుడిని సంబోధించవచ్చు' అంటున్నాడు. 'దిల్‌సాఫ్' అంటే విశ్వాసం, అర్పణలతో పాటు ఎలాంటి అసూయా ద్వేషాలు, క్రోధలోభాలు మోహ మదమాత్సర్యాలు ఉండని మనసు ఉన్నవారు ఇక్కడ రావాలంటున్నాడు. భగవంతుడిని అర్థించవచ్చంటున్నాడు. న్యాయం దొరికేది ఇక్కడే అంటూ, 'ప్రపంచంలోని అతిపెద్ద ప్రభుత్వం ఇదే' అంటున్నాడు సాహిర్. ఓ వైపు నుంచి చూస్తే సాహిర్ 'భక్తి తత్వం' చెప్తాడు. మరో వైపు నుంచి చూస్తే తన సోషలిస్టు సిద్ధాంతాన్ని అతి సుందరంగా వివరించాడు. భగవంతుడు అనే భావాన్ని ప్రభుత్వంతో పోల్చటంలో సాహిర్ సోషలిస్టు భావాలు స్పష్టం అవుతాయి. అదీ మాములు ప్రభుత్వం కాదు ' సబ్సే బడి సర్కార్ ' అన్నిటికన్నా 'పెద్ద ప్రభుత్వం ' ఇదే! ఇది సాహిర్ సినీగేయ రచన సంవిధానంలో గొప్పతనం. ఎక్కడా తన సిద్ధాంతంతో రాజీపడలేదు. సందర్భ ఔచిత్యాన్ని చెడనివ్వలేదు. పైగా సినీ సందర్భాన్ని ఉద్దీపితం చేస్తాయి గేయంలోని పాదాలలోని భావాలు. ఎందుకంటే, పాట చివరలో ఒక స్నేహితుడిని ప్రేమించిన హీరో చెల్లెలు, వాళ్ల సంభాషణ విని, ఏ పూలతో నాయిక భగవంతుడిని అర్పిస్తే తన ప్రియుడు తనకు దక్కుతాడో, ఆ పూలను తెచ్చి చివరి క్షణంలో నాయిక వైపుకు ఆ పళ్లాన్ని తోసి ఆ పూలతో ఆమె అర్పించేట్టు చేస్తుంది. ఇది నాయకుడు చూడడు. అతని స్నేహితుడు చూస్తాడు. నాయకుడు తన చెల్లెలితో చెప్పి మోసం చేశాడని అనుకుంటాడు. 'దిల్ సాఫ్ ' అన్న పదం సరిగ్గా సరిపోతుంది. నాయకుడు సంపూర్ణంగా భగవంతుడిపై భారం వేసి కళ్లు తెరవకుండా ధ్యానం చేస్తున్నాడు. అతడి స్నేహితుడు అనుమానంతో కళ్లు తెరిచి అన్నీ గమనిస్తున్నాడు. భారం భగవంతుడిపై వేశాడు కానీ సంపూర్ణంగా కాదు. చేతులు జోడించి భగవంతుడి సన్నిధిలో ఉన్నాడు కానీ అతని దృష్టి భగవంతుడిపై లేదు. 'మిల్తా హై జహా న్యాయ వొ దర్బార్ యహీ హై' వారు వారు వారి వారి విశ్వాస్దం కొద్దీ ఫలితం పొందుతారు. విశ్వసించని నాయకుడి స్నేహితుడు హీరోపై కక్షగట్టి దుష్టులతో చేతులు కలుపుతాడు. విశ్వాసం కల హీరో, నాయికతో కలసి దుష్టులను ఎదుర్కుంటాడు. చివరికి నాయకుడికి నాయిక దక్కుతుంది. స్నేహితుడు తనని ఇష్టపడిన నాయకుడి చెల్లెలిని చేసుకుంటాడు. అంటే సాహిర్ గేయ రచన సినిమా సందర్భ పరిధిని దాటదు. సినిమా కథను, పాత్రల వ్యక్తిత్వాలను ప్రదర్శిస్తుంది. కానీ సాహిర్ భావనలను మాత్రమే ప్రదర్శిస్తుంది. సార్వజనీన సత్యాలను ప్రతిఫలిస్తుంది. ఇలాంటి గేయ రచన వల్ల సాహిర్ సినిమాలను తన గేయాలతో విజయవంతం చేయగల ఏకైక సినీకవిగా ఎదిగాడు.

పాట చిత్రీకరణ కూడా సందర్భోచితంగా ఉంటుంది. సాహిర్ తన పాటలో భగవంతుడిని 'ఇదీ' అని పేరుతో ప్రదర్శించలేదు. 'భగవాన్ ' 'మాలిక్ ' 'ఉస్‌కొ ' 'సర్కార్ ' ఇలాంటి విశాలమైన పదాలు వాడాడు కానీ రాముడు, కృష్ణుడు, శివుడు, అల్లా, జీసస్ వంటి ఏ పరిమితమైన నామవాచకాలను వాడలేదు. ఎందుకంటే సాహిర్‌కు విశ్వజనీనమైన దైవ భావనపై నమ్మకం . సంకుచితమైన దైవభావనపై

విశ్వాసం లేదు. ఈ పాట చిత్రీకరణ కోసం కొండపై ఉన్న జెజురి ఖండోబా మందిరాన్ని ఎంచుకున్నారు. ఎంతో పవిత్రంగా భక్తిభావన ఉట్టిపడేలా పాటను చిత్రీకరించారు. సన్నివేశానికి తగ్గ ఉద్విగ్నతనూ చిత్రీకరణ ప్రతిబింబిస్తుంది.

ఎలాగయితే సంకుచిత దైవ భావనను ఒప్పుకోని శైలేంద్ర 'సజన్ రే ఝూట్ మత్ బోలో లో 'ఖుదా' అన్న పదంతో భగవంతుడిని సూచిస్తూ, సార్వజనీనమైన సత్యాలను అతి స్పష్టంగా చెప్పాడో, అలాగే, దైవంపై విశ్వాసం లేని సాహిర్ కూడా 'సార్వజనీన సత్యాలను భగవాన్ మాలిక్, సర్కార్ వంటి పదాల ఆధారంగా ప్రదర్శించాడు. వినేవాళ్లకు నీతి చెప్పే గొప్ప తాత్విక గీతాలు, మార్గదర్శనం చేస్తూ, సుఖమయ జీవితానికి దారిచూపే అతి గొప్ప గీతాలు భజన గీతాలు సృజించారు.

'కాలా బజార్' సినిమాలో శైలేంద్ర రెండు అత్యంత అద్భుతమైన భజన గీతాలు రచించాడు. నిజానికి ఒక పాట ద్వందార్థం పాట కావటంతో దాన్ని భజనగా అంగీకరించలేకపోయారు. రైలులో పై బెర్త్‌లో పై పడుకున్న నాయికను 'ఊపర్‌వాలా' అని సంబోధిస్తూ ఎదురుగా ఉన్న ఆమె తల్లిదండ్రులకు 'పైనున్న భగవంతుడు' 'పై వాడు' తలపించే రీతిలో సృజించాడీ పాటను శైలేంద్ర. అంటే ఎవరు ఎలా అర్థం చేసుకుంటే అలా అర్థమయ్యేపాట అన్నమాట. మరో సందర్భంలో అవినీతికి అక్రమాలకు పాల్పడవద్దని నిర్ణయించుకున్న నాయకుడి మానసిక సంఘర్షణను అతని తల్లి, సోదరి పాడే భజనద్వారా ప్రతిబింబిస్తాడు శైలేంద్ర. పరమాద్భుతమైన గేయ రచన సంవిధానానికి మచ్చుతునకలు ఈ రెండు పాటలు.

*(వచ్చే నెల మరికొన్ని పాటల కబుర్లు)*

Post your comments